

# నక్షత్రాలు నల్లబడ్డాయి

— కప్పగంతుల మల్లికార్జునరావు.

రెండు పూటలా కడుపునిండా తిండి పెట్టే ఠికాణాలేని ఇంట పుట్టేడు రంగనాథం. తండ్రి, పెద్ద రాగి చెంబు నొకదాన్ని పట్టుకొని 'సీతారామాభ్యాం నమః' అంటూ ఇంటింటికీ తిరిగి ఆ రోజు తిథి వార నక్షత్రాలను వల్లెవేస్తుండటం రంగనాథం చాలా కాలం చూచాడు.

అయినా రంగనాథం దృష్టి ఎప్పుడూ తమ పాతబడ్డ పెంకు

టింటికి ముందున్న మూడంతస్తుల భవనంమీదే వుండేది. ఎప్పటికైనా ఆ భవనం తనదవుతుందని అతను వూహించుకొంటుండేవాడు.

ఆ వూహలకి ఆధారం-అతనికి చిన్నప్పటినుంచీ జాతకాల మీద, అదృష్టాలమీద గల విశ్వాసం- గురి!

"మా వాడికేం? అలా అగుపిస్తాడు కాని వాడిది గొప్ప అదృష్ట జాతకం. సిరిసంపదలు వాడి అరికాలులో రాపిపెట్టి వున్నాయి. అలాంటి మేడలు మూడు కొంటాడు. మహారాజ జాతకం వాడిది." తండ్రి ఎవరితోనో, ఏదో సందర్భంలో అనటం విన్నాడు. అప్పటినుంచి ఆ రోజుకోసం అతను ఓపిగ్గా ఎదురు చూడసాగేడు.

యస్సెల్సీ తప్పినప్పుడు అతను కించిత్తయినా విచారించలేదు. "ఆ! దేనికైనా ప్రాప్తం వుండాలోయ్. నా జాతకంలో చదువు యోగం అంతే. మనది బిజినెస్ లైను. అరచేతిలో ధనరేఖ జెర్రిపోతులా కనిపిస్తోంది- చూస్తుండు."

తండ్రి చచ్చేవరకు బేవార్సు తిండి తింటూ ఇలాంటి పోసుకోలు కబుర్లు చెప్తూ కాలక్షేపం చేసేసేడు. తండ్రితో పాటు తిండి అలంబన కూడా పోయింది. కడుపు కాలేక మార్గం చూచుకోక తప్పలేదు.

ఎదురింటి మూడంతస్తుల భవనం వారబ్బాయి రాంబాబు రంగనాధంకన్నా నాలుగేళ్ళు పెద్ద. దాన ధర్మాలు చేయటంలో, మంచి వాడన్న కీర్తి సంపాదించటంలో, తండ్రికన్నా నాలుగాకులు ఎక్కువే.

రంగనాధం, రాంబాబు నాశ్రయించాడు. అతడు చేసిన దానంతో టూరింగ్ గుడ్డల కొట్టు పెట్టేడు.

నెత్తిన మూట పెట్టుకొని వీధి వీధీతిరగటం మొదట్లో కొంచెం నామర్దాగానే కన్పించింది. అయితే 6 నెలలు తిరిగేసరికల్లా మూట నెత్తినుంచి దిగి సైకిలెక్కింది. ఆ తర్వాతఅద్దె కొంపలోకి, మరికొన్నాళ్ళకు స్వంత భవనంలోకి మారింది. దివిసీమ ఉప్పెనలా అదృష్టం, దానితోపాటు ఐశ్వర్యం రంగనాధాన్ని ముంచెత్తేయి.అదే సమయంలో రాంబాబును దురదృష్టం, దారిద్ర్యం 'సుడిగాలి'లా చుట్టేసేయి.

అదృష్టం వరించి బిజినెస్‌లో కల్సి వస్తున్న సమయంలో, తన

సిరిసంపదల్ని అనుభవించేటందుకు వారసులు లేరన్న దిగులు పట్టుకొంది రంగనాధానికి. అయితే అక్కడా అదృష్టమే.

సరిగ్గా ఐశ్వర్యపు వుప్పెనలో మునిగివున్న సమయంలోనే రంగనాధం భార్య కడుపులో శ్రీవెంకటేశ్వర వరప్రసాద్ పడ్డాడు.

అతను పుట్టిన మర్నాడో, 3 వ రోజో ఎదురింటి మూడంతస్తుల భవనం రంగనాధాని దయ్యింది. ఐశ్వర్యం సీట్లు మార్చుకొంది. అదృష్టం పార్టీ ఫిరాయించింది.

'నాలాగే నా కొడుకూ గొప్ప అదృష్టజాతకుడు' అనుకొని సంబరపడ్డాడు రంగనాధం.

* * *

శ్రీవెంకటేశ్వర వరప్రసాద్ పుట్టిన రెండేళ్ళకు, దారిద్ర్యం మధ్య రాంబాబు ఇంట్లో పద్మావతి పుట్టింది. ఆమె పుట్టి 10 రోజులన్నా నిండక ముందే గుండె ఆగి రాంబాబు చనిపోయాడు. దురదృష్టజాతకురాలని అంతా పద్మావతిని ఆడిపోసుకొన్నారు. ఎవరూ అడగకుండానే జ్యోతిష్కులు ఆ పిల్ల జాతకం లెక్కలు కట్టి అన్ని విధాలా నష్టజాతకురాలని తేల్చి పారేశారు.

మరో వైపు శ్రీవెంకటేశ్వర ప్రసాద్ జాతకం చూచినవారంతా ఒకటే పొగడటం. తాతాలు ప్లస్ బిర్లాలంత ధనవంతుడు అవుతాడన్నారు. నెహ్రూ వంశంలాగా రాజకీయంగా గొప్పవాడవుతాడన్నారు. సైన్స్‌లో రామన్‌లా, కవిత్వంలో రవీంద్రనాధ్ టాగూర్‌లా పేరు సంపాదిస్తాడన్నారు.

అలా శ్రీవెంకటేశ్వరప్రసాద్ జాతకం ప్రకారం, రాబోవు కాలం అన్ని విధాలా గొప్పగా వుంది. కాని అతని వర్తమానమే రంగనాధానికి గొప్ప వర్రీ అయింది.

రంగనాధం సంపాదించిన బంగారం అంతా కల్సి బట్టలుగా చేయించి తొడిగినా శ్రీవెంకటేశ్వరప్రసాద్ చూడబుద్ధి వేసేలా వుండడు. అతడి అంగాంగం అవలక్షణ సంపన్నం. పోనీ ఆరోగ్యమన్నా మంచిదా అంటే అదీ లేదు. 365 రోజుల్లో 300 రోజులు మంచం మీదే వుంటాడు. మందబుద్ధి.

జాతకరీత్యా అన్ని అవలక్షణాలు గల పిల్లగా పేరు పొందిన పద్మావతి, ఎంతటివారినీ రూపంతో

ఇట్టే ఆకర్షిస్తుంది. అందానికి ఆరోగ్యం ఎప్పుడూ మెరుగులు దిద్దుతూనే వుంది. పాదరసంలా మెరిసిపోయే తెలివితేటలు ఆమె సొత్తు.

చిత్రమేమిటంటే చిన్నప్పటి నుంచీ ఈ అదృష్ట దురదృష్టజాతకు లిద్దరూ స్నేహితులయ్యారు. శ్రీ వెంకటేశ్వరప్రసాద్‌కు పద్మావతి అంటే చచ్చేంత ఇష్టం. పద్మావతికి అతనంటే ఎక్కడ లేని జాలి.

"ఆ పిల్లతో స్నేహం ఏందిరా? మన అంతస్థేమిటి? దాని అంతస్థేమిటి? పైగా అది నష్టజాతకురాలు. పుట్టుకతోనే తండ్రిని మింగింది. పుట్టకముందే ఆ ఇంటి ఐశ్వర్యాన్ని, అదృష్టాన్ని మింగింది. ఆ దురదృష్టం మనల్ని అంటుకుంటుంది. దానితో స్నేహం చేయకు" అని ఎన్నో విధాలా చెప్పి చూచాడు రంగనాథం. ఎందరిచేతనో చెప్పించి చూశాడు. వారి స్నేహాన్ని మాత్రం భగ్నం చేయలేకపోయాడు.

"పోనియ్‌లే మామయ్యా! నా దురదృష్టం మీ అబ్బాయికి అంటుకొంటుందనే ఎందుకనుకొంటారు? మీ అబ్బాయి అదృష్టం నాకు అంటుకోవచ్చుగా?" అందోసారి పద్మావతే కల్పించుకొని.

'మామయ్యా! అబ్బో-అబ్బో! ఎంత గుండెలు తీసిన బంటువే! నీ ఎత్తుగడ నాకు తెలీదనా? ఈ ఇంటి కోడలివయి నా కొంప కూల్చాలను కొంటున్నావేమో- ఆ పప్పులేం ఉడకవు?'

పద్మావతితో అనే ధైర్యం చాలలేదు. అంచేత మనసులో అనుకొని అప్పటినుంచి కొడుక్కి ధనవంతుల గొప్పతనాన్ని, బీద వారి నీచ గుణాలని వర్ణించి వర్ణించి నూరిపోశాడు.

వయసొచ్చినా శ్రీ వెంకటేశ్వర ప్రసాద్‌కు కొత్త అందం రాలేదు. ఆరోగ్యం బాగుపడలేదు. చదువు అసలు అబ్బలేదు. వ్యాపారపు తెలివితేటలు పట్టుబడలేదు. పద్మావతితో స్నేహమూ మానలేదు.

అయితే తాను ధనవంతుడి నన్న గర్వం వచ్చింది. బీదవారి నందరినీ ఓ వర్గంగా చూచి అసహ్యించుకోటం నేర్చుకొన్నాడు.

"గొప్పవాళ్ళకు గొప్ప బుద్ధులే వస్తాయ్. నా కొడుకు అదృష్ట జాతకుడు. పుట్టటమే ఐశ్వర్యంతో గొప్పవాడుగా పుట్టేడు. వాడు చేసుకోబోయే పిల్ల, వాడికన్నా అదృష్ట జాతకురాలు, ఐశ్వర్యవంతురాలిగా

వుండాలి.'' వూరంతా చాటింపు వేసి తృప్తి చెందేడు రంగనాథం.

* * *

ఇంటి దారిద్ర్యం పద్మావతి వృద్ధి కేం అడ్డం కాలేదు. యవ్వనంతో పాటు అందం పెరిగింది. ఆడవాళ్ళు అసూయ పడే అందం. చదువులో ఎప్పుడూ ఫస్టే. మంచితనంలో, కలగలుపుగా మెలగటంలో బెస్టు.

అయినా తన దరిద్రం పద్మావతి పెళ్ళి విషయంలో వో శాపంగా పరిణమిస్తుందని శారదమ్మ భయ పడసాగింది.

తన భర్త, రంగనాథానికి సహా యం చేసిన సంగతి ఆమెకు తెల్సు. పద్మావతీ, శ్రీ వెంకటేశ్వర ప్రసాద్‌ల స్నేహాన్ని చాలాకాలంగా చూస్తూనే వుంది. అతడికి ధనం తప్ప మరేమీ లేవు. పద్మావతికి అన్నీ వున్నా ధనం లేదు. అంచేత యిద్దరికీ పెళ్ళి అవుతే?

అయితే ఆమె బతికి చెడ్డది. ఒకప్పుడు సర్వ భోగాలు అనుభ వించిన తన యింట్లోకి యాచకు రాలిగా అడుగు పెట్టటానికి మనసు అంగీకరించలేదు. అంచేత మధ్య వర్తిని రాయబారిగా పంపింది.

"చూచావురా వాళ్ళ బుద్ధి? అలు సిచ్చి యింటికి రానిస్తే కుటుంబానికే వురిత్రాడుగా ఆ పిల్ల రావాలను కొంటున్నది'' అన్నాడు రంగ నాధం.

శ్రీవెంకటేశ్వర ప్రసాద్‌కు పద్మావతి తన పెళ్ళాం అవుతుం దంటే మొదట్లో ఆశ వేసింది, సంతోషం కలిగింది. పద్మావతి, తను- భార్యా భర్తలయినట్లే వో క్షణం కలగన్నాడు.

కాని తండ్రి మాటలు విన్నాక ఐశ్వర్య మదం ఆవరించింది. తను గొప్ప వర్గం వాడినన్న అహం ఆవరించింది. కళ్ళకి నల్లటి పొరలు కమ్మాయి. విసిరేసిన రాయిలా పరుగెత్తుకుంటూ పద్మావతి యింటి కెళ్ళేడు. పద్మావతి తల్లి ఎదురు పడింది.

"ఎప్పుడో మీ ఆయన చేసిన ముష్టి సహాయంతోనే మా నాన్న యింత గొప్ప వాడయ్యాడని అను కొంటున్నారా మీరు? అదంతా మా నాన్న గొప్పతనం-నా అదృష్టం. కావాలంటే ఆ డబ్బుకు నాలుగిం తలు పారేస్తాను- పద్మావతికి పెళ్ళి చేసుకోండి. కాని నాకు భార్య కావా ల్సిన పిల్లకు అందం, చదువు- యివి కాదు అర్హతలు. యింకా చాలా వుండాలి- ఏమనుకొన్నారో?''

కొడుకు వుపన్యాసాన్ని తండ్రి

వాకిట్లో నుంచే విన్నాడు. తన కొడుకు తనంత ప్రయోజకుడయినందుకు అమితానందం చెందేడు. ఆ ఆనందంతో ముందు కొచ్చి శారదమ్మ మొహాన మరికొన్ని మాటల్ని విసిరికొట్టేడు.

"నీ కూతురు అందమైనదే, తెలివిగలదే! వొప్పుకొంటా. కాని నేను తల్చుకొంటే యీ విషయాల్లో నీ కూతురు అమ్మమ్మలాంటి దాన్ని నా కోడలుగా సంపాదించుకోగలను. ఆ మాట కొస్తే నా కొడుక్కి బీద పిల్లను చేసుకోటానికీ నాకభ్యంతరం లేదు, కురూపిని చేసుకోటానికీ నాకభ్యంతరం లేదు. కాని నీ కూతురు లాంటి దురదృష్ట జాతకురాలిని చేసుకొని మా కుటుంబ భవిష్యత్తును ఖూనీ చేయలేను. ఏవమ్మోవ్! నీ కూతుర్ని చూచి నువ్వు మురిసిపోతున్నావేమో! లేకపోతే యీ రాయబారం పంపే ధైర్యం వస్తుందా?కానీ యిది గుర్తుంచుకో- డబ్బు, అందం, విద్య, ఆరోగ్యం దేన్నైనా డబ్బు పారేసి కొనుక్కో వచ్చు. కాని ఎంత డబ్బిచ్చి కొనుక్కోలేనిది అదృష్ట జాతకం. అది మా పర్మనెంటు ఆస్తి. గుర్తుంచుకో."

తండ్రీ కొడుకులు అలా శారదమ్మ దారిద్ర్యాన్ని, పద్మావతి దురదృష్ట జాతకాన్ని వస్త్రాపహరణం చేసి ఎడా పెడా వాయించి పోయారు.

* * *

రంగనాథానికి అదృష్టపు వుప్పెన ఎంతవుధృతంగా వచ్చిందో అంత వుధృతంగా వెనక్కి పోసాగింది. వర్షపు నీరులా సిరిసంపదలు అంతర్ధానం కాసాగేయి.

బిజినెస్సులో వచ్చిన ఆ 'ట్విస్టు' రంగనాథం గుండెను 'ట్విస్టు' చేసి పారేసింది. మంచంలో పడుకొని కొడుకును గురించి ఆలోచించాడు.

ఆలోచించగా- ఆలోచించగా తన ఐశ్వర్యమే, కొడుకు మరింత మూర్ఖుడిగా, అప్రయోజకుడుగా మారటానికి కారణంగాకన్పించింది. కొడుకు పెళ్ళి- డబ్బు సంపాదించటం కన్నా గొప్ప సమస్యగా గోచరించింది.

యిదే సమయంలో పద్మావతిని అదృష్టం మీద అదృష్టం వరించసాగేయి. చదువు పూర్తయింది. ఏదో పెద్ద ఉద్యోగానికి సెలక్షన్ వచ్చింది. చాలా గొప్ప ఉద్యోగులు ఆమెను పెళ్ళి చేసుకోటానికి ముందు కొస్తున్నారు. అయినా ఆమె శ్రీ వెం. ప్రసాద్‌తో స్నేహంగానే వుంది.

"ఏరా? పద్మావతిని పెళ్ళి చేసు కొంటావా?"

అప్పుడు తండ్రి మాట విని శారదమ్మతో అలా మాట్లాడి పద్మావతిని చేజేతులా జారేసుకొన్నందుకు అతనికి తండ్రి మీద కోపంగా వుంది. పద్మావతిని చూచినప్పుడల్లా, ఆమె సాధిస్తున్న ఘనతను విన్నప్పుడల్లా, అతను మనసులో ఏడుస్తూనే వున్నాడు.

"పద్మావతి ఎప్పుడో నా భార్య కావల్సింది. నువ్వే చెడగొట్టేవ్?"

"యిప్పుడు మునిగిపోయిందే ముందిలే. మనం 'వూ' అంటే యీ యింటి కోడలుగా పరుగెత్తుకొంటూ రాదూ? చూస్తావుగా!"

ఉప్పెన నీరంతా వెనక్కి పోయినా యింకా కొంత నీరు మిగిలి పోయినట్లు, రంగనాథం సంపాదించిన దాంట్లో చాలా భాగం నష్టపోయినా, మిగిలిన ధనం కూడా తక్కువైనదేం కాదు.

యిల్లు అలాగే వుంది. బ్యాంక్ బేలెన్సు అలాగే వుంది. వ్యాపారం మాత్రం దివాలా తీసింది.

"శారదమ్మా! నేను అప్పుడన్నవన్నీ మర్చిపో. ఆనాడు నీ కూతుర్ని కాదన్నాను. యివాళ నీ కూతుర్ని కోడల్ని చేసుకోటానికొచ్చాను."

శారదమ్మ కడుపు మండింది. రంగనాథం పరువు ప్రతిష్ఠల్ని మానభంగం చేయాలనిపించింది. కానీ తమాయించుకొంది.

"నా ఆస్తి పోయింది. నేను దివాలా తీసేనని లోకం అనకోవచ్చు. అందులో కొంత నిజం లేకపోలేదు. అయితే నా అదృష్టాన్ని యీ బిజినెస్సులో ఎగుడు దిగుడులు చెరపలేవుగా? యిదిగో నాకున్న ఆస్తి అంతా నీ కూతురి పేరే రాసేను. పెళ్ళినాడు రిజిస్ట్రేషన్. యివిగో పత్రాలు. నువ్వు 'వూ' అంటే నా ఆస్తి నీది. నీ పూర్వపు యిల్లు నీది. నా కొడుకు నీ అల్లుడు."

శారదమ్మ మొహం చాటంత అవుతుందనుకొన్న రంగనాథం నిరాశ చెందేడు.

"నాదేం లేదు. ఆ నాడు నేనడిగితే మీరు కాదన్నారు. యీ నాడు మీరు నన్ను కాదు అడగాల్సింది- నా కూతుర్ని. అది అంగీకరిస్తే నాకేం అభ్యంతరం లేదు." గదిలో నుంచి అప్పుడే బయటికొస్తున్న పద్మావతిని చూపిస్తూ ఆమె హుందాగా లోపలికెళ్ళింది.

"అంతావిన్నాను మామయ్యా! ప్రసాద్ బాబు అంటే నాకు ఎప్పుడూ యిష్టమే."

రంగరాధంలోవి గర్వం మీసం మెలేసింది. అహం ఆనందంగా నవ్వింది.

"ఎటొచ్చీ పుట్టిన నాటి నుండీ అతవి మొహాన అతికించారే- ఆ బోర్డు అంటే నాకు అసహ్యం."

"బోర్డా! ఏం బోర్డు?"

"అదృష్టజాతకు డన్న బోర్డు. పాపం-ఆ బోర్డు మీరు కట్టకపోతే యివాళ ప్రసాద్ బాబు స్థితి మరీ యింత అధ్వాన్నంగా వుండేది కాదు."

"అంటే....?"

"జన్మనక్షత్రాలు, గ్రహరాసులు రాజుల్ని బికారుల్ని, బికారుల్ని రాజుల్ని చేయగలవేమో నాకు తెలియదు. కానీ, శ్రమ, పట్టుదల, దీక్ష యిత్యాది గుణాలు మనిషిని వున్నతుడిని చేసే అసలు సిసలు గ్రహాలు అని నా నమ్మకం. అంటోతుకేసినట్లు, 'దురదృష్ట జాతకురాల'న్న ముద్రవేసిన నన్ను నడిపించిన గ్రహాలు యివే. యీ గ్రహాలను ప్రసాద్ బాబుకు కూడా అతికించాలన్న నా ప్రయత్నాలని, మీరు అతని మొహానికట్టిన బోర్డుకు నల్లతుమ్మ జిగురులా అతుక్కొన్న శనిగ్రహం పడ నీయలేదు."

"యింతకీ నువ్వనే దేమిటి? వాడిని చేసుకొంటావా- లేదా?"

అతని అరుపుకు అపోజిట్ ధోరణిలో వో క్షణంఆగి నిదానంగా అంది పద్మావతి-

"అప్పుడెప్పుడో మా అమ్మ నన్నడక్కుండా పిచ్చిదై జాతకాలు చూచుకోకుండా యిలాంటి ప్రసక్తే తెచ్చింది కదా మామయ్యా! మంచి గుణపాఠం మా అమ్మకు నేర్పేరని ఆనందించాను. జాతకాలని గురించి అంత చెప్పేక కూడా మీరు మళ్ళీ ఆ ప్రశ్నే అడిగితే ఏం చెప్పను? నాకు మీకన్నా ఎక్కువ జాతకాలపిచ్చి. ప్రసాద్ బాబు జాతకం, నాజాతకం వేరని నేను మా పెళ్ళివిషయం ఎప్పుడూ ఆలోచించలేదు."

"యిప్పుడు ఆలోచించరాదూ? మునిగిపోయిందేముంది?"

పద్మావతి ఆయన చేతికో శుభ లేఖ నిచ్చింది.

'వధువు పద్మావతి, వరుడు డాక్టర్ ప్రభాకర్- ఢిల్లీలో సీని యర్ సైంటిఫిక్ ఆఫీసర్....'

"నాకూ ఢిల్లీలోనే వుద్యోగం అయింది మామయ్యా! మా యిద్దరి జాతకాలు, గ్రహస్థితులు అన్ని

విధాల సరిపోయాయి. అతనూ నాలాగా కష్టపడి స్వీయప్రతిభతో చదువుకొని పైకొచ్చిన వాడు. శత్రువునైనా ప్రేమించటం తప్ప ద్వేషించటం చాతకానివాడు."

"అప్పు ఆ దండకం." శుభ లేఖను వుండగాచేసి విసిరికొట్టేడు. జేబులోనుంచి ఆస్తి పత్రాలు తీసేడు.

"చదువు గొప్పలూ, ఆస్తి గొప్పలూ నా దగ్గర చెప్పుకోకు. ముప్పై ఏళ్ళు ముష్టి ఆఫీసరు వుద్యోగాలు యిద్దరూ చేసినా మూడు లక్షలకు అధికారిణివి కాలేవు-తెల్సిందా? అంచేత బాగా అలోచించిచెప్పు. ముందు యీ పత్రాల్లో ఆస్తులు, అంకెలూ చూడు."

పద్మావతి ఆ కాగితాల మడతలు విప్పలేదు. వాటి నలాగే వీక్షించూచి ప్రశాంతంగాఅంది-

"ఆస్తులు-ఐశ్వర్యాలు, బుద్ధిని గుణాన్ని మార్చగలవేమో కాని జాతకాల్నిమార్చలేవు మామయ్యా! అనుభవమే గుణపాఠాలనునేర్పాలి.

"నేను నమ్మిన జాతకాలు లేని మనిషిని పెళ్ళి చేసుకోటానికి నేనేం పిచ్చిదాన్నికాను, ఏడుపులకి లొంగటానికి త్యాగమూర్తినీ కాను, నీ కొడుకును ప్రేమించిన ప్రేమ మూర్తినీకాను, డబ్బుకు సలాం చేస్తూగులామునయ్యే లోభమూర్తినీ కాను."

రంగనాథం చటుక్కున ఆమె చేతిలోని కాగితాల్ని లాక్కొని చించబోయాడు.

"ఎంత పిచ్చివాడివి మామయ్యా? యిందాకేమో, శుభలేఖల్ని చించినంత మాత్రాన మా మనసులు మారుతాయని, విఘ్నాలు తల్లక్రిందులవుతాయని అనుకొన్నావు. యిప్పుడేమో ఆ కాగితాల్ని చించి నన్ను బెదిరించాలని, భయపెట్టాలని చూస్తున్నావ్?"

రంగనాథం ఆ కాగితాల్ని చింపేసి చిన్న చిన్న ముక్కల్ని చేసేడు.

"పోనియ్‌లే మామయ్యా! ఆ కాగితాలతో పాటు నీ మనసులోని ఆలోచనల్ని కూడా చింపెయ్. శ్రీ వెంకటేశ్వర ప్రసాద్ నికన్పించని అదృష్టంమీద కాక, కన్పించే స్వశక్తి మీదఆధారపడిబతకనియ్."

పద్మావతి అదృష్టం అతడిని వెక్కిరించ సాగింది.

జన్మ నక్షత్రాలు నల్లబడ్డాయి. జాతకాలు తారుమారయ్యాయి. గ్రహస్థితి గళ్ళు మార్చుకొంది.

"యిక వెళ్ళిరా మామయ్యా!"

రంగనాథం కదల్లేదు. ట్విస్ట్ అయిన అతని గుండెల్లో రక్తం గడ్డకట్టింది. *